# అభివృద్ధిని చూసి ఓటేయ్యండి



39వ డివిజన్‌లో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

- తెలంగాణను కాపాడుకోవాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- నగరంలోని 39, 57, 58వ డివిజన్లలో ప్రచారం

కార్పొరేషన్, నవంబర్ 22: తెచ్చుకున్న తెలంగాణను కాపాడుకోకపోతే భవిష్యత్ తరాలు గోస పడుతాయని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పార్టీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక 39, 57, 58వ డివిజన్లలో ఆయన ప్రచారం చేశారు. స్థానిక ప్రజలు, మహిళలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, తెలంగాణ రాక ముందు అరిగోసపడ్డామని తెలిపారు. సమైక్య పాలనలో ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నప్పటికీ ఆంధ్రా ముఖ్యమంత్రులు ఉండడంతో ఈ ప్రాంతానికి అన్యాయం జరిగిందన్నారు. కరెంట్ లేక, తాగునీరు రాక అరిగోసపడ్డామన్నారు. తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద గొడవలు జరిగిన దృశ్యాలు ఇంకా కండ్ల ముందు కదలాడుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో కరెంటు, తాగునీటి కష్టాలు తీరినట్లు తెలిపారు. పచ్చని తెలంగాణను దోచుకునేందుకు మళ్లీ ఆంధ్రోళ్లు ఒక్కటయ్యారని, కండ్ల మంటతో కడుపులో కత్తులు పెట్టుకొని వచ్చారని విమర్శించారు. హైదరాబాద్‌లో మా ఆస్తులు ఉన్నాయని, మా సంపద అంటున్నారని ఆరోపించారు. కేసీఆర్‌ను ఓడిస్తే తెలంగాణను దోచుకోవచ్చునని కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. పచ్చని తెలంగాణపై ఆంధ్రోళ్లు విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలు ఢిల్లీ పార్టీలని, తెలంగాణలో 40 ఏళ్ల దారిద్ర్యానికి వారే కారణమన్నారు. కాంగ్రెస్ పార్టీ రౌడీషీటర్‌కు టికెట్ ఇచ్చిందన్నారు. ఆయనను గెలిపిస్తే బతుకుతామా అని పేర్కొన్నారు. బండి సంజయ్ గుండెపోటు డ్రామాతో ఎంపీగా గెలిచాడని విమర్శించారు. ఎంపీగా గెలిచిన తర్వాత బండి సంజయ్ ఎప్పుడైనా కనిపించాడా, అభివృద్ధి కోసం ఒక్క రూపాయి తెచ్చాడా అని ప్రశ్నించారు. అవినీతితో వందల కోట్లు సంపాదించి ఆ డబ్బులు పంచి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. బండి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మళ్లీ కనిపిస్తాడా అని పేర్కొన్నారు. ఎన్నికల వేళ ఆగం కావద్దని సూచించారు. అభివృద్ధి కొనసాగాలంటే కేసీఆర్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. తనను మరోసారి గెలిపిస్తే భవిష్యత్ తరాలకు గొప్ప నగరాన్ని అందిస్తానన్నారు. మొదలు పెట్టిన ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారంలోకి వచ్చేది లేదని, పోయేది లేదన్నారు. ఆ పార్టీలకు ఓటు వేసి వృథా చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్ కొండపల్లి సరిత-సతీశ్, బీఆర్ఎస్ నాయకులు కొత్త జైపాల్‌రెడ్డి, మొగిలోజు వెంకట్, కొత్త అనిల్ తదితరులు పాల్గొన్నారు.



39వ డివిజన్‌లో ప్రచారానికి తరలివచ్చిన ప్రజలు



తుమ్మనపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

# రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే

- బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మురిగిపోయినట్టే
- గెలుపు బాటలో ఉన్న కారు గుర్తుకే ఓటు వేయండి
- బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 22: తెలంగాణలో వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మురిగిపోయినట్టేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సింగాపూర్, మందాడిపల్లి, తుమ్మనపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమేనని, ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. ప్రస్తుత బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను 7 సార్లు గెలిపిస్తే నియోజవర్గాన్ని ఎలాంటి అభివృద్ధి చేయలేదని చెప్పారు. ఆయనను నమ్ముకున్న నాయకులను, కార్యకర్తలను రెండేండ్ల నుంచి పట్టించుకోవడం లేదని, ఇప్పుడు ఎన్నికలు వచ్చినంక గాలి మోటర్ల ఎక్కి అకాశం మీదనే తిరుగుతండు తప్పా హుజూరాబాద్‌ను పట్టించుకోలేదన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్, రైతు బంధు, బీమా, కల్యాణలక్ష్మి లాంటి అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, బీడీ, గీత కార్మికులకు పింఛన్లు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. ఏ ఆపద వచ్చిన అండగా ఉంటానని, పిలిస్తే పలుకుతానని, 24 గంటలు మీకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాడి శాలినిరెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ ఇరుమల్ల రాణీసురేందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొండల్‌రెడ్డి, సర్పంచులు గూడూరి ప్రతాప్‌రెడ్డి, ఎల్లయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు సురుకొంటి మాధవరెడ్డి, మిడిదొడ్డి స్వామి, నాయకులు తుమ్మనపల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఏనుగు సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్లు యాళ్ల యతీశ్వర్‌రెడ్డి, నర్ర భగవాన్‌రెడ్డి, సామల సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సంగెం ఐలయ్య, నాయకులు చొల్లేటి కిషన్‌రెడ్డి, రవీందర్‌రావు, కన్నబోయిన శ్రీనివాస్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి



ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్

- బూత్ కమిటీ సభ్యులు క్రియాశీలక పాత్ర పోషించాలి
- సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి
- పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, నవంబర్ 22: నియోజకవర్గంలోని ఇంటింటికీ వెళ్లి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన పట్టణంలోని ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదని, వారి ఇండ్ల వద్దకు వెళ్లి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాల వివరాలను తెలియజేయాలని నాయకులకు, కార్యకర్తలకు, బూత్ కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల సమయం చాలా తక్కువగా ఉన్నదని కార్యకర్తలందరూ గ్రామాల్లో ఉత్సాహంగా పనిచేసి ప్రచారం ముమ్మరం చేయాలని ఆదేశించారు. బూత్ కమిటీ సభ్యులు క్రియాశీలక పాత్ర పోషించి బూత్‌లలో ఉన్నటువంటి ఓటర్లకు సీఎం కేసీఆర్ చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలే మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 27న చొప్పదండి పట్టణంలో మంత్రి కేటీఆర్ పర్యటన ఉన్నందున పట్టణం, మండలంలోని ప్రజలను పెద్ద సంఖ్యలో తరలించి విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, సింగిల్ విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చీకట్ల రాజశేఖర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ ముద్దం మల్లేశ్, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్లు మాదూరి శ్రీనివాస్, వడ్లూరి గంగరాజు, బిజిలి అనిత, నాయకులు గుర్రం నందిరెడ్డి, కొత్తూరు నరేశ్, మహేశుని మల్లేశం, గాండ్ల లక్ష్మణ్, బత్తిని సంపత్, జహీర్, అనిల్, నరేశ్ రావణ్, మావురం మహేశ్, కొండిల్ల శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు

# 'మాలలంతా బీఆర్ఎస్‌ను గెలిపించాలి'

కార్పొరేషన్, నవంబర్ 22: రాష్ట్రంలో దళితుల సంక్షేమం, అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు మాలలంతా బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనకరాజు కోరారు. బుధవారం స్థానిక మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల ఆర్థికాభివృద్ధి కోసం దళితబంధు వంటి గొప్ప పథకాన్ని కేసీఆర్ తీసుకువచ్చారన్నారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను తీసుకువచ్చి అమలు చేస్తున్న బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యేగా గంగుల కమలాకర్‌ను గెలిపించుకుంటామని పేర్కొన్నారు. సంఘం నాయకుడు రాంచందర్ పాల్గొన్నారు.

# గంగుల, వినోద్‌కుమార్ సతీమణుల ప్రచారం



ప్రచారం చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్ సతీమణి రజిత, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ సతీమణి మాధవి, మేయర్ సునీల్‌రావు సతీమణి అపర్ణ

కార్పొరేషన్, నవంబర్ 22: నగరంలోని 33వ డివిజన్‌లో మంత్రి గంగుల కమలాకర్ సతీమణి రజిత, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ సతీమణి మాధవి, మేయర్ సునీల్‌రావు సతీమణి అపర్ణ బుధవారం సాయంత్రం ఇంటింటా ప్రచారం చేశారు. డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కరీంనగర్ మరింత అభివృద్ధి సాధించాలంటే ఎమ్మెల్యేగా గంగుల కమలాకర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ తనిఖీ

రాంనగర్, నవంబర్ 22: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌ను బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నేరస్తుల, రౌడీ షీటర్ల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, వాహన తనిఖీలు నిర్వహించి ఓటర్లకు భద్రతా భావాన్ని కలిగించాలని, పాత ఎన్నికల నేరస్తులు, రౌడీ షీటర్లు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న సిబ్బందితో వారికి కేటాయించబడ్డ ప్రాంత పరిధి గురించి అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం ఎక్కువగా జరుగనున్నందున రెట్టించిన ఉత్సాహంతో, పటిష్ట ప్రణాళికతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్లు స్వామి, కళ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.